## లారీని ఢీకొన్న కారు
### - కారులో ప్రయాణిస్తున్న ఐదుగురికి గాయాలు



ఓజిలి, అక్టోబర్ 12 ప్రభాతవార్త ఓజిలి మండలం రాజుపాలెం వద్ద జాతీయ రహదారిపై లారీని కారు ఢీకొన్న ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. వీరిలో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు గాయపడ్డారు. ఓజిలి మండలం రాజుపాలెం జాతీయరహదారిపై వెళుతున్న లారీని అదే మార్గంలో వెళుతున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిసునతన్న ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. తృటిలో పెనుప్రమాదం తప్పినట్లయింది. ఈ సంఘటన గురువారం జరిగింది. సమాచారం అందుకున్న ఓజిలి పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన క్షతగాత్రులను అంబులెన్స్ ద్వారా ఆసుపత్రికి తరలించారు. ఓజిలి హైవేపెట్రోలింగ్ పోలీసులు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా చర్యలు చేపట్టారు. ఓజిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



## పూర్ణాహుతితో ముగిసిన పవిత్రోత్సవాలు



వడమాలపేట, అక్టోబరు 12 ప్రభాతవార్త: అప్పలాయగుంట ప్రసన్న వెంకటేశ్వరస్వామివారి ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించిన పవిత్రోత్సవాలు పూర్ణాముతితో గురువారం ఘనంగా ముగిశాయి. ఆలయంలో ఉదయం స్వామి వారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి తోమాలసేవ, అర్చన చేపట్టారు. అనంతరం యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామివారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో విశేషంగా అభిషేకం చేశారు. మాడవీధుల్లో ఉభయ దేవేరులతో ప్రసన్న వెంకటేశ్వర స్వామి తిరువీధి ఉత్సవం నిర్వహించారు. భక్తులు నారికేళ కర్పూర నీరాజనాలు సమర్పించారు. సాయంత్రం 6 గంటలకు ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు ఆధ్వర్యంలో పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు వైభవంగా ముగిశాయి.

# మరింత సంతృప్తికరంగా శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు



### గరుడువాహనం సాయంత్రం 6.30 గంటలకే
### వృద్దులు, దివ్యాంగులు చంటి పిల్లల తల్లిదండ్రుల దర్శనాలు రద్దు : ఆర్జిత సేవలు రద్దు

తిరుపతి, అక్టోబర్ 12, ప్రభాతవార్త ప్రతినిధి

తిరుమల శ్రీ వారి ఆలయంలో అక్టోబరు 15 నుండి 23వ తేది వరకు జరుగనున్న నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అక్టోబరు 19న జరుగుతున్న గరుడ వాహన సేవ దర్శనాన్ని ఎక్కువ మంది భక్తులకు కల్పించాలనే ఉద్దేశంతో రాత్రి 7 గంటలకు బదులుగా సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభించాలని టిటిడి నిర్ణయించింది. అదే విధంగా ఎక్కువ మంది సామాన్య భక్తులకు మూలమూర్తి దర్శనం కల్పించేందుకు వీలుగా ఆర్జిత సేవలు, ప్రత్యేక దర్శనాలను టిటిడి రద్దు చేసింది. స్వామి వారికి అత్యంత ప్రీతిపాత్రమైన గరుడసేవను దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు ముందురోజు నుండే గ్యాలరీలో నిరీక్షిస్తుంటారు. వారి సౌలభ్యం మేరకు టిటిడి ఈ నిర్ణయం తీసుకుంది. ఆగమశాస్త్రం ప్రకారం సూర్యాస్తమయం తరువాతే రాత్రి వాహనసేవ నిర్వహిస్తారు. కాగా అక్టోబర్ 19న సాయంత్రం 6.15 గంటలకు సూర్యాస్తమయం అవుతుంది. ఆ తరువాత సాయంత్రం 6.30 గంటలకు గరుడసేవ ప్రారంభమవుతుంది. గతంలో రాత్రి 9 గంటలకు గరుడసేవ ప్రారంభమవుతుండగా, ఆ సమయాన్ని రాత్రి 7 గంటలకు మార్చారు ప్రస్తుతం ఆగమ సలహామండలి నిర్ణయం మేరకు గరుడసేవ సమయాన్ని అరగంట ముందుకు మార్చడం జరిగింది. కాగా బ్రహ్మోత్సవాల్లో ఎక్కువ మంది సామాన్య భక్తులకు దర్శనం కల్పించేందుకు వీలుగా ఆర్జిత సేవలు, ప్రత్యేక దర్శనాలను టిటిడి రద్దు చేసింది. శ్రీ వారి ఆలయంలో అష్టదళపాదపద్మారాధన, తిరుప్పావడ, కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, సహస్రదీపాలంకార సేవలను టిటిడి రద్దు చేసింది. ముందస్తు ఆర్జిత బ్రహ్మోత్సవం సేవా టికెట్లు బుక్ చేసుకున్న భక్తులకు నిర్దేశిత వాహనసేవకు మాత్రమే అనుమతిస్తారు. అక్టోబరు 14న అంకురార్పణ కారణంగా సహస్రదీపాలంకార సేవను టిటిడి రద్దు చేసింది.

## తిరుమల బస్సుల్లో ఎలక్ట్రానిక్ ఆటోమేటిక్ వాయిస్ అనౌన్స్‌మెంట్

### త్వరలో మరో 10 ఎలక్ట్రిక్ ఉచిత బస్సులు
### టీటీడీ ఈఓ ఏవి.ధర్మారెడ్డి

తిరుమల, అక్టోబర్ 12 ప్రభాతవార్త: ప్రతినిధి:

తిరుమలలో శ్రీవారి భక్తులను ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి చేరవేసి ఉచిత బస్సుల (ధర్మరథాలు)లో భక్తుల సౌకర్యార్థం వారు దిగవలసిన ప్రాంతాలు, రాబోయే బస్సుస్టాప్‌ల గురించి ఎలక్ట్రానిక్ ఆటోమేటిక్ వాయిస్ అనౌన్స్‌మెంట్ ఏర్పాటు చేయాలని టీటీడీ ఈఓ ఏవి.ధర్మారెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం టీటీడీ పరిపాలనా భవనంలోని ఈఓ కార్యాలయంలో రవాణా విభాగం అధికారులతో ఈఓ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఈఓ మాట్లాడుతూ తిరుమలలో 24 గంటల పాటు ఉచిత బస్సులు భక్తులను ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి చేరవేస్తున్నాయన్నారు. అయితే ఈబస్సులలో ప్రయాణించే భక్తులు తాము దిగవలసిన ప్రాంతాలు తెలియక ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. తాము దిగవలసిన ప్రాంతాల పేర్లను అనౌన్స్‌మెంట్‌ల ద్వారా భక్తులకు తెలిసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భక్తుల సౌకర్యార్థం (పిఎం-ఈబస్ సర్వీస్ పథకం కింద)ఆర్టీసి సహకారంతో మరో 10 ఎలక్ట్రికల్ బస్సులు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తిరుమలలో కాలుష్యాన్ని తగ్గించే క్రమంలో యాత్రికులు, అధికారులు డీజిల్ వాహనాలను భవిష్యత్తులో సీఈఎస్ఎల్ (కన్వర్జన్స్ ఎనర్జి సిస్టమ్స్ లిమిటెడ్) ద్వారా ఎలక్ట్రికల్ వాహనాలను తీసుకోవాలన్నారు. తద్వారా తిరుమలలో కాలుష్యాన్ని తగ్గించవచ్చునని చెప్పారు. అదేవిధంగా తిరుమలలో ఎలక్ట్రిక్ వాహనాలకు సరిపోయే విధంగా చార్జింగ్ స్టేషన్‌ల సంఖ్యను మరింత పెంచాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈసమావేశంలో టీటీడీ జెఈఓ వీరబ్రహ్మం, ఎఫ్ ఏ అండ్ సీఏఓ బాలాజీ, రవాణా విభాగాదిపతి శేషారెడ్డి, ఆర్టీసీ ఆర్ఎం చెంగల్‌రెడ్డి, ఈఈ సురేంద్ర, డీఈ (ఎలక్ట్రికల్) రవిశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతిలో డబుల్ డెక్కర్ బస్ ప్రారంభం

### ప్రారంభించిన టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి



డబుల్ డెక్కర్ బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న టిడిపి చైర్మన్ , మేయర్, కమిషనర్

తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 12, ప్రభాతవార్త

తిరుపతి నగరంలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన డబుల్ డెక్కర్ బస్సును టిటిడి చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, మేయర్ డా. శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్లు ముద్రనారాయణ, అభినయ్ రెడ్డిలు జెండా ఊపి గురువారం ప్రారంభించారు. ఎస్‌పిజెఎస్ఎం క్రీడా మైదానంలో ఈ బస్‌ను ప్రారంభించారు. అక్కడ నుండి జ్యోతి థియేటర్ కూడలి, టౌన్ క్లబ్, ఎస్వీ యూనివర్సిటీ వరకు వెళ్లి అక్కడ నుండి టౌన్ క్లబ్ కూడలి మీదుగా మామిడికాయల మండి వరకు, అక్కడ నుంచి తిరిగి శ్రీ తాతయ్యగుంట గంగమ్మ ఆలయం వరకు ఈ బస్‌లో టిటిడి చైర్మన్, మేయర్, కమిషనర్, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, అధికారులు తదితరులు ప్రయాణించారు. అనంతరం గంగమ్మను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దక్షిణ భారత దేశంలోని మొట్టమొదటి సారిగా ఈ డబుల్ డెక్కర్ బస్‌ను తిరుపతిలో ఏర్పాటు చేయడం సంతోషం అన్నారు. తిరుపతి నగరం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతున్నదని, కౌన్సిల్ ఆమోదంతో ఈ బస్‌ను నగర పాలక సంస్థ కొనుగోలు చేశామన్నారు. ఈ నేపథ్యంలో ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతి అందాలను వీక్షించేందుకు వీలుగా ఈ డబుల్ డెక్కర్ బస్‌ను ఏర్పాటు చేశామని అన్నారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చే యాత్రికులకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఈ బస్ నాలుగు మార్గాల్లో నడపనున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, నగర పాలక సంస్థ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### దేశమ్మ గుడి నిర్మాణం
# నా పూర్వ జన్మ సుకృతం
### - మంత్రి రోజా



నగరి, అక్టోబరు 12 ప్రభాతవార్త: నగరి దేశమ్మ గుడి నిర్మాణం నా పూర్వ జన్మ సుకృతమని మంత్రి రోజా పేర్కొన్నారు. గురువారం రూ.1 కోటి 120 లక్షలతో జరుగుతున్న నూతన గుడి నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. ఆలయ అర్చకులు నేత్ర దేవత దేశమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి రోజమ్మను దీవించి ఆశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మానవుని సేవలో మాధవుని సేవ మహాభాగ్యమన్నారు. ఎక్కడో పుట్టి, ఎక్కడో పెరిగి సినీ పరిశ్రమలో ఉన్న నన్ను గుర్తించి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎమ్మెల్యేగా, మంత్రిగా చేయడం జన్మ, జన్మల జగనన్న రుణం తీర్చుకోలేనన్నారు. నా విజయానికి నగరి ప్రజానికం బ్రహ్మరథం పట్టారన్నారు. ప్రజలందరి ఆరాధ్య దేవతగా దేశమ్మతల్లి నలు దిక్కులా చల్లని దీవెనలు అందిస్తున్నారని కొనియాడారు. నేత్ర దేవతకు నేత్ర పర్వంగా కొంగ్రొత్త హంగుళ్ళతో గుడి నిర్మాణం నా చేతుల మీదుగా జరగడం జన్మ, జన్మల రుణానుబంధమన్నారు. ఏ రాజకీయ నాయకుడికి కలగని దేవుని సేవా భాగ్యం నాకు కలగడం నా రాజకీయ జీవితంలో మరువలేనిదని తెలియజేశారు.

### దేశమ్మ దేవాలయానికి కాణిపాకం రథం



నేత్ర దేవత దేశమ్మ దేవాలయంలో కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ధర్మ ప్రచార రథానికి ఘన స్వాగతం పలికారు. ఆలయానికి విచ్చేసిన రథానికి గోపూజ, ప్రత్యేక అర్చనల అనంతరం విచ్చేసిన భక్తులకు ప్రసాద వినియోగం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వేణుబాబు, ఈవో రామచంద్ర, అర్చకులు గణేష్ స్వామి, మునిరాజులు తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా హాస్పిటల్‌గా
# గూడూరు ఏరియా హాస్పిటల్
### ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ రావు వెల్లడి



గూడూరు, అక్టోబర్ 12, ప్రభాతవార్త

గూడూరు పట్టణంలోని గూడూరు ఏరియా ఆసుపత్రిని జిల్లా స్థాయి ఆసుపత్రిగా రూపొందించేందుకు మాస్టర్ ప్లాన్ తయారు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద రావు తెలిపారు. గురువారం గూడూరు పట్టణంలోని గూడూరు ఏరియా ఆసుపత్రిలో ఆసుపత్రి అభివృద్ధి సలహా కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే వరప్రసాద రావు ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరప్రసాద్ రావు మాట్లాడుతూ ఈ ఆసుపత్రిని జిల్లా ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకున్నామని ఇందులో భాగంగా పలు కట్టడాలు నిర్మాణంలో ఉన్నాయని వీలైనంత త్వరలో వాటిని పూర్తి చేసి ప్రజలకు వైద్య సేవలు అందించే విధంగా చర్యలు తీసుకునే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. గూడూరు వెంకటగిరి సూళ్లూరుపేట నియోజకవర్గం సంబంధించి ప్రధాన ఆసుపత్రిగా గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఉండడంతో ఈ ఆసుపత్రిని జిల్లా స్థాయి ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్ ఆసుపత్రి వైద్య సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

# నిర్మాణాలు ప్రారంభించని ఇళ్ళు రద్దు
### - స్టేజ్ కన్వర్షన్ పనులు నిలుపుదల చేసిన లబ్దిదారులపై ఆర్ఆర్ యాక్ట్
### - కలెక్టర్ సగిలి షన్మోహన్



చిత్తూరు, అక్టోబర్ 12 ప్రభాతవార్త:

గత నాలుగు నెలలుగా బేస్మెంట్ స్థాయిలో నిర్మాణాలు జరుగని ఇళ్ళ రద్దుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ సగిలి షన్మోహన్ ఎంపిడిఓలు, హౌసింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ సగిలి షన్మోహన్ జెసి పి.శ్రీనివాసులు, హౌసింగ్ పిడి పద్మనాభంతో కలిసి ఇళ్ళ నిర్మాణాల పురోగతిపై ఎంపిడిఓలు, మున్సిపల్ కమీషనర్లు, హౌసింగ్ ఇఇలు, డిఇలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్ళ నిర్మాణాల స్టేజ్ కన్వర్షన్‌లో పనులు చేయని లబ్దిదారులతో మాట్లాడి పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని, దీనిపై ఆసక్తి చూపని లబ్దిదారుల ఇంటి పట్టాను రద్దు చేయడానికి ప్రతిపానదలు సిద్ధం చేయడంతో పాటు ఇప్పటి వరకు ఇంటి నిర్మాణం కోసం లబ్దిదారులు ప్రభుత్వం నుండి పొందిన ఆర్థిక సహాయంను ఆర్ఆర్ యాక్ట్‌ను ప్రయోగించి తిరిగి రాబట్టాలని ఆదేశించారు. రద్దు చేసిన ఇళ్ళ స్థానంలో అర్హత వున్న లబ్దిదారులకు ఇళ్ళు మంజూరు చేసి పనులు త్వరితంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే మండలాల వారీగా నిర్ధేశించుకొన్న ఇళ్ళ నిర్మాణాల లక్ష్యాల సాధనకు ప్రణాళికలు సిద్ధం చేసుకొని ముందుకు వెళ్ళాలని కలెక్టర్ ఆదేశించారు.

# కల్యాణ వెంకన్నకు 50 కేజీలు వెండి వస్తువులు
### 250 గ్రాములు బంగారు శంకు హస్తం వితరణ:స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ



చంద్రగిరి, అక్టోబర్ 12 ప్రభాతవార్త: శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి వారికి దాతలు గురువారం 50 కేజీలు వెండి వస్తువులతో పాటు 250 గ్రాములు బంగారు శంకు హస్తం కానుకలు అందజేసినట్లు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమిళనాడు, సేలంకు చెందిన ఎల్.ఆర్.కృపాకర్, ఎస్.ఎం.కె.రవి, ఎల్.ఆర్.కిషోర్ కుమార్ స్వామి వారి ఉత్సవమూర్తులకు రూ.59.50 లక్షలు విలువైన విశేష కానుకలు సమర్పించుకున్నట్లు తెలిపారు. ఇందులో 250 గ్రాములు బంగారుతో శంకు హస్తం కానుకగా అందజేశారు. అదేవిధంగా రూ. 50 కేజీలు వెండిని ఉపయోగించి బెల్, దూపకల్, హారతి, దీప స్థంభాలు తయారు చేయించి వితరణ చేసినట్లు వెల్లడించారు. స్వామి వారి పట్ల వారికి గల భక్తి ప్రపత్తులను ఆమె కొనియాడారు. దాతలకు, వారి కుటుంబాలకు తప్పక స్వామి వారి ఆశీస్సులు లభించగలవన్నారు. ఈ నేపథ్యంలో బంగారు, వెండి ఆభరణాలకు అర్చకులు ఆలయంలోని మూలవిరాట్ చెంత ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం పడికావలి వద్ద దాతలకు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేసి, శీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ తేనెపల్లి వెంకస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, ఆలయ అర్చకులు శేషాచార్యులు, నారాయణాచార్యులు, జమేదర్ చంద్రశేఖర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# నరేగాతో ఉపాధి పనులు పెంచండి
### ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కె. జవహర్ రెడ్డి



తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 12, ప్రభాతవార్త

వర్షభావ పరిస్థితులు ఉన్న ప్రాంతాల్లో వలసలు వెళ్లకుండా స్థానికంగానే ఉపాధి హామీ పనులు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కె. జవహర్ రెడ్డి సూచించారు. గురువారం అమరావతి నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పలు అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫిరెన్స్ నిర్వహించగా తిరుపతి కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్‌కి వెంకటరమణా రెడ్డి, అధికారులు పాల్గొన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ జగనన్న భూ హక్కు భూ రక్ష రీ సర్వే పనులు ప్రణాళిక ప్రకారం ఆలస్యం లేకుండా పురోగతి ఉండాలని, 22 ఎ భూములు పరిష్కారం, రీ సర్వే జరిగిన గ్రామాల్లో హద్దు రాళ్ల నాటడం పూర్తి చేయాలని సూచించారు. రహదారులకు సంబంధించి అటవీ బూముల పరిష్కారానికి ప్రత్యమ్నాయం అన్నది ఎక్కడ అన్నది గుర్తించాలని అన్నారు.

వ్యవసాయశాఖకు సంబంధించి ఈ క్రాప్ నమోదు పూర్తి కావాలని, ఫర్టిలైజర్స్ కొరత లేకుండా ఆర్బికెల్లో అందుబాటులో ఉండాలని సూచించారు. వాతావరణ ప్రభావం వల్ల ఉపాధి లేదన్న సమస్యరాకూడదని నరేగా పనులు కల్పించాలని అన్నారు. నిర్మాణాలు పూర్తి అయిన ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు సంబంధిత శాఖలకు అప్పగించాలని అన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటి త్రాగు నీటి కుళాయిలు ఏర్పాటు కార్యక్రమం త్వరగా పూర్తి కావాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫిరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి పెంచలకిషోర్, లాండ్ అండ్ సర్వే ఎడి జయరాజ్, పంచాయితీ రాజ్ ఇంజనీర్ శంకరనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## దృష్టి లోపాలపై ప్రజలకు అవగాహన కల్పించండి
### జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణా రెడ్డి

తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 12, ప్రభాతవార్త ఈ నెల 24వ తేది ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా అందరు కలసి దృష్టి లోపాలపై ప్రజలందరికి అవగాహన కల్పించాలని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణా రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం అక్టోబర్ నెల రెండవ గురువారం ప్రపంచ దృష్టి దినోత్సవం నిర్వహిస్తున్నారని ప్రజలలో అవగాహన కల్పించేందుకు ఈ సంవత్సరపు నినాదమైన మీ కంటిని ప్రేమించండి అని ప్రజలలోకి తీసుకువెళ్లాలని సందేశమిచ్చారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా బ్యానర్‌ను ఆవిష్కరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కళ్ళు ముఖానికి ఆభరణాలు అని కళ్ళు ఎంత అందంగా ఆరోగ్యంగా ఉంటాయో మనము అంతే అందంగా ఆరోగ్యంగా కనిపిస్తామని తెలిపారు. సర్వేంద్రియనామ్ నయనం ప్రధానం అని తెలిసినా చాలా మంది కళ్ళ విషయంలో అజాగ్రత్తగా ఉంటారని కళ్ళను మనం జాగ్రత్తగా చూడకపోతే భవిష్యత్‌లో చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందని హెచ్చరించారు.

# అత్యాచారం, హత్య కాదు ఆత్మహత్యే
### - పెనుమూరు మండలం మైనర్ బాలిక మరణం మిస్టరీ వెల్లడించిన ఎస్పీ రిశాంత్‌రెడ్డి



చిత్తూరు, అక్టోబర్ 12 ప్రభాతవార్త:

పెనుమూరు మండలం కావూరివారిపల్లి, ఠాణా వేణుగోపాలపురం గ్రామంకు చెందిన మునికృష్ణయ్య కుమార్తె మైనర్ బాలిక(16) మరణం మిస్టరీని పోలీసులు ఛేధించారు. మైనర్ బాలికపై అత్యాచారం ఆపై హత్య చేశారని వచ్చిన వార్తల్లో నిజం లేదని ఆమె ఆత్మహత్య చేసుకొందని ఎస్పీ రిశాంత్‌రెడ్డి వెల్లడించారు. వివరాలు ఎస్పీ రిశాంత్‌రెడ్డి గురువారం విలేకరులకు వెల్లడించారు. కావూరివారిపల్లి ఠాణా వేణుగోపాలపురం గ్రామంకు చెందిన మైనర్ బాలిక సెప్టెంబర్ 17వ తేదీ నుండి కన్పించడం లేదని 18వ తేదీ ఆమె కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారన్నారు. ఈ క్రమంలో 20వ తేదీ రాత్రి 8 గంటలకు ఎగువచెరువ గ్రామంకు సమీపంలోని భూపాల్‌రెడ్డి వ్యవసాయ బావిలో అదృశ్యమైన బాలిక మృతి చెంది వుండటం గుర్తించడం జరిగిందన్నారు. మైనర్ బాలిక అనుమానస్పదంలో మృతి చెందివుండవచ్చునని ఆ బాలిక తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేయడంతో అనుమానితులైన నలుగురిని విచారించడం జరిగిందన్నారు. ఇందులో మృతి చెందిన మైనర్ బాలిక ఇంటి సమీపంలోని డెయిరీలో పని చేసే ఒక బాలుడు, పెనుమూరు డిగ్రీ కళాశాల విద్యార్థి, అతని ఇద్దరు స్నేహితులు వున్నారన్నారు. వీరిపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేయడం జరిగిందని మైనర్ బాలిక మృతికి వీరికి ఎలాంటి సంబంధం లేదని తేలిందన్నారు. మైనర్ బాలిక మృతదేహంను సెప్టెంబర్ 21న ప్రత్యేకంగా ఒక గైనకాలజిస్టుతో పోస్టుమార్టం చేశామని మృతదేహంపై ఎలాంటి గాయాలు లేవని తేలిందన్నారు. మృతదేహం నాలుగు రోజులు నీళ్ళలో కుళ్ళడంతో తలపై వెంట్రుకలు పూర్తిగా వుడిపోయాయని, ఎఫ్ఎస్ఎల్ నివేదిక వస్తే మృతిపై కచ్చితమైన కారణం తెలుస్తుందని పోస్టుమార్టం నిర్వహించిన డాక్టర్ పేర్కొన్నారని తెలిపారు. మృతి చెందిన మైనర్ బాలికకు సంబంధించి ఆర్ఎఫ్ఎస్ఎల్, డిఎన్ఎ అనాలసిస్ నివేదికల్లో సైతం మైనర్ బాలికపై ఎలాంటా ఆఘాయిత్యం జరులేదని తేలిందన్నారు.

# పుంగనూరు ప్రజల కలలు సాకారమైన నేటి రోజు!

**-రెండువేల కుటుంబాలకు అపార్ట్‌మెంట్లు -తోడుగా జగనన్న కాలనీలు**



పుంగనూరు, అక్టోబరు 12 ప్రభాతవార్త : సరైన సదుపాయాల్లేక..ఆదుకునే నాయకుడు లేక ..73 ఏళ్లపాటూ నరకయాతన అనుభవించిన జనం...ఇపుడు ఆనందోత్సాహాలలో మునిగిపోతున్నారు. చారిత్రక ప్రసిద్ది చెందిన పుంగనూరు నియోజకవర్గం బ్రిటీష్ పాలన అనంతరం జమీందారుల పాలనలో ఉండేది. జమీందారుల పాలనలో ఇక్కడి ప్రజలకు అనేక సదుపాయాలు కల్పించారు. జమీందారుల పాలన అంతమైన తరువాత ఏడున్నర దశాబ్దాల కాలంలో పుంగనూరు కునారిల్లిపోయింది. వచ్చిన అనేక మంది శాసనసభ్యులు ప్రజల సదుపాయాలకు ప్రాధాన్యత ఇవ్వలేకపోయారు. పాలకుల వైఫల్యం,ప్రజల అమాయకత్వం వెరసి ఏడున్నర దశాబ్దాల కాలం పాటూ ప్రజలు తమకు అందాల్సిన అనేక సదుపాయాలను కోల్పోయారు.అయితే, ఈప్రాంతానికి శాసన సభ్యుడుగా ఎన్నికయిన తరువాత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఇక్కడి ప్రజలను ఆదుకోవాలని సంకల్పించారు. దివంగత సిఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో అటవీశాఖా మంత్రిగా పనిచేసిన తరుణంలో పుంగనూరు అభివృద్ది కోసం తపించినా, మహనేత వైఎస్ఆర్ ఆకస్మిక మరణంతో ప్రభుత్వాలు మారిపోయాయి. మాజీ సిఎం కిరణ్‌కుమార్, చంద్రబాబులు పుంగనూరు అభివృద్దిని తొక్కిపడేశారు. అనంతరం జగన్ ప్రభుత్వంలో మహామంత్రిగా ఎదుగుతున్న పెద్దిరెడ్డి పుంగనూరు పట్టణ ప్రజలందరికి స్వంత ఇండ్లు కల్పించాలని, నియోజకవర్గానికి అంతటికీ మంచినీరు అందించాలని సంకల్పించారు. ఇందులో భాగంగా మంచినీటి కోసం మూడు రిజర్వాయర్ల నిర్మాణానికి సంకల్పిస్తే, చంద్ర బాబు అనుచరులు కోర్టుకు వెళి అడ్డుకున్నారు. అయినా, ఆయన తన ప్రయత్నం మానక పుంగ నూరు పట్టణ ప్రజలకు శాశ్వత ఇంటి వసతి కల్పించేందుకు ప్రయత్నంచేసిన టిడ్కో సముదా యాలు, జగనన్న కాలనీల నిర్మాణాలను సకాలంలో పూర్తిచేశారు. శుక్రవారం మంత్రి చేతుల మీదుగా పుంగనూరు పట్టణంలో టిడ్కో ద్వారా 1539 ఇండ్లను, రూ.వందకోట్లతోనిర్మించి పూర్తిచేసి అందచేస్తున్నారు. ఇదే క్రమంలో జగనన్న కాలనీ కూడా ప్రజలకు ఆయన అంకితం చేయనున్నారు. ఆయన వెంటన ఆయన కుమారుడు ఎంపి మిధున్‌రెడ్డి, ఆయన తమ్ముళ్ళు పెద్దిరెడ్డి, ద్వారకనాధరెడ్డి,ఎంపి రెడ్డెప్ప,ఎంపిపి భాస్కరరెడ్డి,మున్సిపల్ ఛైర్మన్ అలీంబాషా, రాష్ట్ర జానపదకళల అకాడమీ కొండవీటి, పిఎంకె అర్బన్ అథారిటీ ఛైర్మన్ వెంకటరెడ్డియాదవ్‌తో పాటూ రాష్ట్ర,జిల్లా స్థాయి నాయకులు అధికారులు పాల్గొంటున్నారు.

## స్విమ్స్ ఆసుపత్రి ఓపిడి బ్లాక్ వద్ద వాహనాల పార్కింగ్

**వార్త ప్రభావం**

తిరుపతి టౌన్, అక్టోబర్ 12 ప్రభాతవార్త : తిరుపతి స్విమ్స్ ఆసుపత్రి వద్ద రోగులు, వారి సహాయకులు వాహనాల పార్కింగ్‌కు మంచి స్థలం ఎంపిక చేసి, వాహనాలు ఆపేందుకు ఇబ్బంది లేకుండా చూస్తామని స్విమ్స్ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. గురువారం వార్త దినపత్రికలో ప్రచురితమైన స్విమ్స్‌లో వాహనాలకు పార్కింగ్ సమస్య, ఆసుపత్రి ఆవరణలో వాహనాలు నిలిపితే సెక్యూరిటి సిబ్బంది గాలి తీసి, ఇబ్బంది పెడుతుండటం పై పోటోలతో కథనం వచ్చింది. దీనిపై వెంటనే స్పందించిన డైరెక్టర్ ఆదేశాలతో సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులు వాహనాలు పార్కింగ్‌కు ఓపిడి భవనం ఎదురుగా ఉన్న స్థలం చూపి అక్కడ టిటిడి సహకారంతో ఏర్పాట్లు చేస్తామన్నారు. అంతేగాక వాహనాలకు గాలి తీసి, ప్రజలను ఇబ్బంది పెడుతున్న సెక్యూరిటీ సిబ్బంది పై చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. రోగులు, వారి సహాయకులు సమస్యలు మా దృష్టికి తీసుకువచ్చిన వార్త యాజమాన్యం రిపోర్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆసుపత్రికి వస్తున్న రోగులకు మెరుగైన, నాణ్యమైన వైద్యం అందిస్తున్నామని, రోగుల సంఖ్యతో బాటు వాహనాలు పెరిగాయని తెలిపారు. పార్కింగ్‌కు చక్కటి ప్రాంతంలో తగిన సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నాం అన్నారు. అందుకనుగుణంగా స్విమ్స్ వారు కొన్ని మార్పులు చేయడం జరిగింది. ప్రదేశాలలో స్థలాలు ఏర్పాటు అందుకు అనుగుణంగా సూచిక బోర్డులను త్వరలోనే ఏర్పాటు చేసి పేషంట్స్‌కు, వారి సహాయకులకు ఎలువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామనిమెడికల్ సూపరింటెండెంట్ డా.రామ్ తెలిపారు.

## క్రీడలు మానసికోల్లాసాన్ని ఇస్తాయి..డిఈవో



తొట్టంబేడు, అక్టోబర్ 12 ప్రభాతవార్త : క్రీడలు మానసికోల్లాసాన్ని ఇస్తాయని తిరుపతి డిఈవో డాక్టర్ వి.శేఖర్ అన్నారు. గురువారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎస్‌డిపి సారధ్యంలో స్కూల్‌గేమ్స్ పోటీలను నిర్వహించారు. వీటిలో ముఖ్యంగా యోగా, ఖోఖో, టేబుల్ టెన్నిస్‌ల పోటీలు నిర్వహించి రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన డిఈవో డాక్టర్ వి.శేఖర్‌కు ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, పిడిలు స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలు ఎంతో అవసరమన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంలో ఉన్న విద్యార్ధినీ విద్యార్థులకు వారిలో ఉన్న ప్రతిభను గుర్తించేందుకు పిడిలు కృషిచేయాలన్నారు. అనంతరం టేబుల్ టెన్నిస్ క్రీడలను ప్రారంభించారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సౌకర్యంగా అదనపు తరగతి గదులను నాడు నేడులో నిర్మాణం చేయాలని ఎస్‌ఎంసి కమిటీ ఛైర్మన్ శంకర్ డిఈవోను కోరగా ప్రస్తుతం నిధుల కొరత ఉందని దశలవారీగా నిర్మాణాలు పూర్తిచేస్తామన్నారు.తిరుపతి జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న రెండో విడత నాడు నేడు పనులను నవంబర్ నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని శ్రీకాళహస్తిలో జిల్లా విద్యాశాఖా ధికారి తెలిపారు. తొలివిడతలో రూ.7కోట్లులో రూ.4కోట్లతో పనులు వివిధ దశల్లో జరుగుతున్నా యన్నారు. నిధులు కొరత అధిగమించడానికి అధికంగా నిధులు ఉన్న చోట నుంచి అవసరమైన చోటుకి నిధులను బదిలీ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 61చోట్ల అంగన్‌వాడీ భవనాలకు రూ.68లక్షలుతో అదనపు తరగతి గదులకు నిధులను అందించామన్నారు. ప్రస్తుతం ఆర్‌ఎఫ్ నిధులు వస్తున్నాయని దశలవారీగా రెండో విడత పనులను అక్టోబర్‌లో పూర్తి చేయాల్సి ఉండగా నవంబర్‌నాటికి పూర్తిచేసేలా సంబంధిత ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీచేశామన్నారు. ఇక్కడ ఎంపికైన జట్లు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. అనంతరం క్రీడల్లో ప్రతిభ కనపర్చిన విద్యార్ధినీ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పలువురు పిడిలు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు పాల్గొన్నారు.

## ద్రవిడ వర్సిటీలో విద్యార్థుల మధ్య ఘర్షణ

**- పోలీసులను ఆశ్రయించిన విద్యార్థి సంఘాలు !!**



కుప్పం, అక్టోబర్ 12 ప్రభాతవార్త : ద్రవిడ విశ్వ విద్యాలయంలో గురువారం సాయంత్రం విద్యార్థుల మధ్య ఘర్షణలు తలెత్తాయి. దీంతో ఇరువర్గాల విద్యార్థులు బాహాబాహీకి దిగి ముష్టియుద్ధాలకు దిగారు. టిఎన్‌ఎస్‌ఎఫ్, వైఎస్సార్‌ఎస్‌యుకు చెందిన నాయకుల మధ్య ఈ ఘర్షణలు తలెత్తాయి. ఇరువర్గాల మధ్య గతనెలలో సైతం చిన్నపాటి తగాదాలు చోటు చేసుకున్నాయని ఈ నేపథ్యంలో గురువారం మరోమారు రెండు విద్యార్థి సంఘాల మధ్య ఘర్షణ జరిగినట్లు తెలిసింది.అయితే ఈ ఘర్షణలో టిఎన్‌ఎస్‌ఎఫ్‌కు చెందిన భార్గవ్‌కు గాయాలైనట్లు సమాచారం. విషయం తెలుసుకున్న గుడుపల్లె ఎస్సై లక్ష్మీకాంత్ విద్యార్థులకు సర్దిచెప్పారు. అయితే ఇరు విద్యార్థిసంఘాల నేతలు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

## మున్సిపాలిటీ అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

**- ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్**



కుప్పం, అక్టోబర్ 12 ప్రభాతవార్త :కుప్పం మున్సిపాలిటీ పరిధిలో వైకాపా పాలకవర్గం చేసిన అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఎమ్మెల్సీ, టిడిపి సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ పరిధి ఏడో వార్డు వడ్డిపల్లిలో ఆయన పర్యటించారు. స్థానికులు మాట్లాడుతూ డ్రైనేజ్ కాలువల నిర్మాణం కోసం ఏడు నెలల క్రితం గుంతలు తవ్వి వదిలేశారన్నారు. దీంతో తరచూ పిల్లలు, వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నా రన్నారు. అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని ఇస్మాయిల్ అనే స్థానికుడు పేర్కొన్నాడు. కాగా 19వ వార్డులో పాముల సంచారం అధికంగా ఉందని మహిళలు ఎమ్మెల్సీ డా॥ కంచర్లకు వివరించారు. ఇటీవల పాడి ఆవులను సైతం పాములు కరిచి చంపేశాయన్నారు. పశువులకు చికిత్సలు అందిస్తామంటే వెటర్నరీ ఆస్పత్రిని సైతం మూడు కిలోమీటర్ల దూరంకు తరలించేశారని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన ఆయన ప్రజల సమస్యలను నేరుగా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటానన్నారు. కుప్పం మున్సిపాలిటీకి మంజూరైన 66 కోట్ల నిధుల్లో ఏయే పనులు చేపట్టారో వైకాపా నేతలు బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో కౌన్సిలర్లు జిమ్‌దాము, సోమశేఖర్, వేలు, సురేష్, వేణు తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్పీచే తవణంపల్లె పోలీస్‌స్టేషన్ తనిఖీ



తవణంపల్లె, అక్టోబర్ 12 ప్రభాతవార్త: తవణంపల్లె పోలీస్‌స్టేషన్‌ను గురువారం చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి తనిఖీ చేశారు. సాధారణ తనిఖీల్లో భాగంగా చిత్తూరు సర్కిల్ పరిధిలోని తవణంపల్లె పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈసందర్భంగా స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించారు. అలాగే మండలంలో నేరాలు, పెండింగ్ కేసుల గురించి పరిశీలించారు. అనంతరం మహిళా పోలీసుల పనితీరు గురించి పరిశీలించారు. అలాగే సిబ్బంది సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో చిత్తూరు రూరల్ వెస్ట్ సీఐ రవిశంకర్‌రెడ్డి, ఎస్సై సుధాకర్‌రెడ్డి,సిబ్బంది పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్‌ను అందజేసిన మంత్రి రోజా



నగరి, అక్టోబరు 12 ప్రభాతవార్త: నగరి మంత్రి క్యాంప్ కార్యాలయంలో విజయపురం మండలం పోతులరాజు కండ్రిగకు చెందిన మునస్వామికి సీఎం రిలీఫ్ ఫండ్ కోసం మంత్రి రోజా ముఖ్యమంత్రి సహాయనిధి చెక్‌ని అందజేశారు. ఈ సందర్భంగా మునస్వామి ఊపిరితిత్తులకు సంబంధించిన అనారోగ్య సమస్యతో ఆస్పత్రిలో వైద్య సేవలు పొందారు. ఆరోగ్యశ్రీలో సంబంధిత సేవలు లేకపోవడంతో ఇందుకు నిమిత్తం ఖర్చును వివరాలతో సీఎం రిలీఫ్ ఫండ్ కోసం మంత్రి రోజా దృష్టికి తీసుకొచ్చారు. సీఎం జగనన్న దృష్టికి తీసుకెళ్లి సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయగా ఈ మేరకు మునస్వామి వైద్యం ఖర్చులకు రూ.1,60లునగదును భార్య రజనికి చెక్కు రూపంలో మంజూరు చేశారు.

## పక్కాగా చైల్డ్ ఇన్ఫో వివరాలు

**- బడి ఈడు పిల్లలందరు బడిలో వుండేలా చర్యలు - కలెక్టర్ సగిలి షన్మోహన్**



చిత్తూరు, అక్టోబర్ 12 ప్రభాతవార్త: బడి ఈడు పిల్లలకు సంబంధించిన చైల్డ్ ఇన్ఫో వివరాలను పక్కాగా నమోదు చేయాలని కలెక్టర్ సగిలి షన్మోహన్ విద్యాశాఖ అధికారు లను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ సగిలి షన్మోహన్ జెసి శ్రీనివాసు లుతో కలిసి నాడు-నేడు పురోగతి, చైల్డ్ ఇన్ఫోలో నమోదు ప్రక్రియ, జిఇఎస్ సంబం ధిత అంశాలపై డిఇఒ విజయేంద్ర రావు, సమగ్ర శిక్ష ఎపిసి వెంకటరమణారెడ్డి, ఇతర విద్యాశాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ బడి ఈడు పిల్లలందరు బడిలోనే వుండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. చైల్డ్ ఇన్ఫోకు సంబంధించి వాలంటీర్ల సర్వే అనంతరం జిల్లాకు చెందిన వివరాల మేరకు బడి ఈడు పిల్లలందరి వివరాలను క్షేత్ర స్థాయిలో ఇంటింటి సర్వే, పాఠశాలలో పూర్తిగా పరిశీలించిన అనంతరం పక్కాగా నమోదు చేయాలన్నారు. చైల్డ్ ఇన్ఫోలో నమోదైన వారిలో ఇప్పటి వరకు పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరువుతున్న వారు ఒక కేటగిరి కాగా చైల్డ్ ఇన్ఫోలో నమోదై పాఠశాలకు హాజరు కాని వారు మరొక కేటగిరిగా గుర్తించి పాఠశాలలకు పూర్తిగా రాని వారి వివరాలను సేకరించాలన్నారు. అలాగే నాడు-నేడు పనులను త్వరితంగా నాణ్యతతో చేపట్టి పూర్తి చేయాలని ఆదేశించారు. సచివాలయ సిబ్బంది విధిగా పాఠశాలను తనిఖీ చేయాలని ఎంపిడిఓలను కలెక్టర్ ఆదేశించారు. అలాగే జిఈఆర్ లక్ష్యాలను వంద శాతం పక్కాగా పూర్తి చేయాలన్నారు.

## దసరా వస్తోంది.. జీతాలేవీ ..? ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అవస్థలు

కోట,సెప్టెంబర్ 12 ప్రభాతవార్త : అన్నదాతలు ప్రకృతితో మమేకమయ్యేలా సేంద్రియ వ్యవసాయం వైపు నడిపించి పెట్టుబడి లేని పంటలు సాగును ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న సిబ్బందికి వేతన కష్టాలొచ్చాయి. ఒకటి ,రెండు నెలల కాదు ఏకంగా ఏనిమిది నెలలుగా ఎదురుచూపులే మిగిలాయి. అదిగో నిధులోస్తాయి. ఇదిగో జమ చేస్తామంటూ ఊరించే మాటలతో కాలయాపన చేస్తూ వస్తున్నారు తిరుపతి జిల్లాలో 2023..24 ఆర్ధిక సంవత్సరంలో రసాయిన రహిత వ్యవసాయ కింద 80 వేల ఎకరాల్లో సాగు వైపు అవగాహన కల్పించడానికి శిక్షణ ఇచ్చేందుకు 700 మంది సేవలదిస్తున్నారు. వీరందరికి ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి సెప్టెంబరు వరకు ఏనిమిది నెలలగా జీతం చెల్లించాల్సి ఉంది.వేతనాలు ఎపుడోస్తాయో తెలియని దుస్థితి. నెలల తరబడి చెల్లించుకుంటే ఎలా పనిచేయాలని సిబ్బంది వాపోతున్నారు. మరో పక్క కొంత మంది ఉద్యోగం చేయలేమని మానేస్తున్నారు. వడ్డీలకు అప్పులు తెచ్చుకొని కుటుంబాన్ని నెట్టుకొస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిబ్బంది దయనీయ జీవితం గడుపుతున్నారు. రెండు ,మూడు నెలలకొకసారి ఇస్తారని ఆశించినా ఫలితం లేకుండా పోయింది.కనీసం దసరా పండెక్కి అయిన జీతాలు దక్కుతాయోనాని వారు ఎదురు చూస్తున్నారు.

## కోట నుంచి గూడూరుకు బైక్ ర్యాలీ



కోట, అక్టోబర్ 12 ప్రభాతవార్త : రాష్ట్రప్రభుత్వం ఎంఎల్సీ మేరిగ మురళీధర్‌ను శాసనమండలి విప్‌గా నియమించిన నేపథ్యంలో గురు వారం కోటలో వైసీపీ రాష్ట్ర కార్య దర్శి నల్లపరెడ్డి వినోద్ కుమార్‌రెడ్డి నివాసం నుంచి గూడూరు వరకు భారీ బైక్ రానయలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వైసీపీ ఆవిర్భావం నుంచి పార్టీ బలోపేతానికి మేరిగ మురళీధర్ ఎంతగానో కృషి చేశారని చెప్పారు. గూడూరు నియోజకవర్గంలోని ప్రతి గడప తెలిసిన వ్యక్తి మేరిగ మురళీధర్ అన్నారు. నాయకులకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ ఏ సమస్య వచ్చినా అండగా ఉన్న నాయకుడు మేరగ మురళీధర్ అని పేర్కొన్నారు. ఆయన సేవలను గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేబినెట్ సహాయ మంత్రి హోదాను, శాసనమండలి విప్ పదవి ఇవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో గూడూరు టికెట్‌ను ఎంఎల్సీ మేరిగ మురళీధర్‌కు ఇవ్వాలని ఆయన పార్టీ అధిష్టానాన్ని కోరారు. గూడూరు సీటును కానుకగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందిస్తామ న్నారు. ఈ ర్యాలీలో కోట ఉప సర్పంచ్ గాది విజయభాస్కర్, షేక్ మొహిన్‌బాషా, పేర్నాటి కిరణ్‌కుమార్, సుబ్రహ్మణ్యం, యస్దాని తదితరులు పాల్గొన్నారు.

## నిడిగల్లు గ్రామంలో ఘనంగా పోలేరమ్మ జాతర



బాలాయపల్లి, అక్టోబర్ 12, ప్రభాతవార్త: నిడిగల్లులో ఘనంగా పోలేరమ్మ అమ్మవారి జాతర గురువారం వైభవంగా జరిగింది. జాతర సందర్భంగా అమ్మవారి ప్రతిమను తయారు చేసి భక్తుల దర్శనార్థం గ్రామం లో కొలువుతీర్చారు. చుట్టుపక్కల గ్రామాలు, పట్టణాల నుంచి వచ్చి అమ్మవారిని దర్శించుకుని సంప్రదా యబద్ధంగా వేయికళ్ళ దుత్త లు, మొలకలు అమ్మవారికి సమర్పించి కొబ్బరికాయలు కొట్టి మొక్కు లు తీర్చుకున్నారు. జాతర సందర్భంగా ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి, మాజీ సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ వెందోటి కార్తీక్‌రెడ్డి, దక్కిలి జెడ్పీటీసీ సభ్యురాలు కలిమిలి రాజేశ్వరి, మాజీ ఎంపీపీ పోలంరెడ్డి వెంకటరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్ఎస్ఆర్ నాయుడు, వెంకటగిరి ఎంపీపీ తంబిశెట్టి తనూజరెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు.

## పేదల సంక్షేమ సీఎం జగన్మోహన్‌రెడ్డి లక్ష్యం

**- వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి**



వెంకటగిరి, అక్టోబర్ 12, ప్రభాతవార్త: పేదల సంక్షేమమే సీఎం జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి తెలిపారు. వెంకటగిరి పట్టణం బంగారుపేటలోని 1,2 వార్డులలో ఆయన మేలు కొలుపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడ అమలు కావడంలేద న్నారు. పేదలు ఆనందంగా జీవించాలని సీఎం నవరత్నాలు పథకం పేరుతో విరివిగా సంక్షేమ పథకాలు ఇస్తున్నట్లు తెలిపారు. పేదల సొంతింటి కల నెరవేర్చిన ఘనత సీఎంకే దక్కిందన్నారు. ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు మేలుకొలుపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని, డ్రైనేజీ నిర్మించాలని స్థానికులు రామ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటా మన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంకటరామయ్య, కళ్యాణి, పూజారి లక్ష్మీ, నాయకులు చెంచయ్య, కోటేశ్వరరావు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్లను గుర్తించి, జాబితాలో చేర్పించండి : మాజీ ఎమ్మెల్యే



గూడూరు, అక్టోబర్ 12, ప్రభాతవార్త : క్లస్టర్ ఇంచార్జిలు, పార్టీ అధ్యక్షులు యూనిట్ ఇన్చార్జులు ఇంటింటికి వెళ్లి వైసిపి పార్టీ అక్రమాలను తెలియజేస్తూ తెలుగుదేశం పార్టీని బలోపేతం చేయాలని గూడూరు మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ పిలుపు నిచ్చారు. గురువారం తిరుపతి జిల్లా గూడూరు పట్టణంలోని తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని క్లస్టర్ ఇన్చార్జిలు, యూనిట్ ఇన్చార్జిలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ ఈనెల 17వ తేదీ తర్వాత నూతన ఓటర్ లిస్టు వస్తాయని వాటిని తీసుకొని యూనిట్, క్లస్టర్, పార్టీ అధ్యక్షులు జాబితా తీసుకుని భారీగా ఓటర్లను వెరిఫై చేయాలని సూచించారు. ఓటర్ లిస్టులో పేర్లు లేని వారిని గుర్తించి వారికి ఓటు హక్కు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికలు ఏ సమయంలో రావచ్చని పార్టీ శ్రేణులు అందరూ కష్టపడి పని చేసి ఎన్నికల్లో విజయం సాధించే విధంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కిరణ్ కుమార్, మధుసూధన్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, వెంకటేశ్వర రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యవంతులుగా చేయడమే జగనన్న లక్ష్యం : నగర మేయర్ డా. శిరీష



తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 12 ప్రభాతవార్త : జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రతి ఒక్కరిని ఆరోగ్య వంతులను చేయడమే జగనన్న లక్ష్యమని నగర మేయర్ శిరీష పేర్కొన్నారు. గురువారం తిరుపతి నగర పాలక సంస్థ పరిధిలోని 47 డివిజన్ జర్న లిస్ట్ కాలనీ, ఎర్రమిట్టలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌లో నగర మేయర్ డాక్టర్ శిరీష పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ శిరీష మాట్లాడుతూ వైద్యం కోసం పేదవాళ్లు అప్పులు పాలయ్యే పరిస్థితి రాకూడదని, ఆరోగ్య సురక్ష క్యాంప్ ద్వారా చికిత్సలను అందిస్తున్నామని చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి కుటుంబానికి ఎలాంటి అనారోగ్య సమస్యలు ఉన్నా, వారిని గుర్తించి వారికి వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. స్పెషలిస్ట్ డాక్టర్ చేత వారికి చికిత్స అందిస్తున్నామని, తర్వాత వారికి అవసరమైన పరీక్షలు కూడా చేయించి, వారిని ఇంటి వద్దకు సురక్షతంగా తీసుకువెళ్లి అప్పజెప్పడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తున్నామని, సంబంధిత పేషెంట్లకు అవసరమైన మందులు అందేలా చూస్తున్నామని తెలిపారు. ఆరోగ్య సురక్ష సభలో నిర్వహించిన క్యాంపులో 1700 మంది పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర పాలక కార్యదర్శి రాధిక రెడ్డి, సూపరింటెండెంట్ రవి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ సూరిబాబు, జూనియర్ అసిస్టెంట్ రాధాకృష్ణ, డాక్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ వైద్యం తరహాలో జగనన్న వైద్య శిబిరాలు :కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 12 ప్రభాత వార్త : కార్పొరేట్ వైద్యం తరహాలో జగనన్న వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు నగర పాలక సంస్థ కమిషనర్ హరిత అన్నారు. నగర పాలక సంస్థ పరిధిలోని 8, 43 వార్డులకు సంబంధించి జర్నలిస్ట్ కాలనీలోని సచివాలయం ఆవరణంలో గురువారం నిర్వ హించిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌లో కమిషనర్ హరిత పాల్గొని ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఎక్కడా లేని విధంగా ప్రజల ఆరోగ్య భద్రత కోసం పెద్ద పీట వేస్తూ జగనన్న ఆరోగ్య వైద్య సురక్ష శిబిరంలో చిన్న పిల్లలకు, గర్భిణీ స్త్రీ సమస్యలు, జనరల్ మెడిసిన్, కంటి వైద్యం అందిస్తున్నారని అన్నారు. అలాగే అన్ని రకాల రక్త పరీక్షలు నిర్వహిస్తు న్నామని అన్నారు. కార్పొరేట్ హాస్పిటల్స్‌కు ధీటుగా ఈ వైద్య శిబిరాల్లో వైద్యం అందిస్తున్నామని అన్నారు. ముందుగా ప్రతి ఇంటికి వాలంటీర్, ఆరోగ్య కార్యకర్తలు, సచివాలయ కార్యదర్శులు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఏదైనా ఆరోగ్య సమస్యలు వుంటే వారికి టోకెన్ ఇచ్చి, ఆరోగ్య సురక్ష శిబిరానికి తీసుకువచ్చి వైద్యం అందిస్తు న్నామని అన్నారు. సుమారు వెయ్యి మంది సద్వినియోగం చేసుకున్నారని అన్నారు. వీరందరికీ ఉచితంగా మందులు పంపిణీ చేశామని అన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ సెక్రెటరీ రాధిక, సూపరింటెండెంట్ రవి, వైద్యులు, సచివాలయ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

## సిమ్స్ ఆసుపత్రికి ఐదు హైడ్రాలిక్ స్టెచ్చర్స్ విరాళం



తిరుపతి టౌన్, అక్టోబర్ 12 ప్రభాతవార్త : స్విమ్స్ ఆసుపత్రికి హైదరాబాదుకు చెందిన దంజా హెల్త్ కేర్ ప్రై.లి. కంపెనీ వారు 572300 విలువ గల ఐదు హైడ్రాలిక్ స్ట్రెచ్చర్లను విరాళంగా అందించారు. ఈ స్ట్రెచ్చర్‌ను గురువారం టిటిడి కార్యనిర్వహ ణాధికారి ఎవి ధర్మారెడ్డి చేతుల మీదుగా స్విమ్స్ స్టోర్స్ వారికి అందజేసారు. ఈ కార్యక్రమంలో జెఇఒ సదాభార్గవి, స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్‌వి కుమార్ పాల్గొన్నారని సూపరింటెండెంట్ రామ్ తెలిపారు. టిటిడి నందు అమలు పరుస్తున్న ఉద్యోగుల హాజరు విధానాన్ని స్విమ్స్ లోనూ అమలు పరచే విధంగా చర్యలు తీసుకుని మొదటి విడతగా 19 పరికరాలతో ఫేస్ రికగ్నిషన్ విధానాన్ని టిటిడి ఈఓ ప్రారంభించారు. నవంబర్ నుండి ఈ విధానాన్ని పూర్తిగా అమలులోకి తెచ్చే విధంగా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. అదే విధంగా స్విమ్స్ నందు వివిధ విభాగాలలో ఇన్ పేషంట్స్‌గా చికిత్స పొందుతున్న వారి సౌకర్యార్థం వారి ఆరోగ్య స్థితిగతులను, వివరాలను ఆన్ లైన్‌లో త్వరితగతిన పొందుపరచడానికి అనుగుణంగా కంప్యూటర్ ఆన్‌వీల్స్ కంప్యూటర్స్ ఆన్ వీల్స్ సిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకుని రావడం జరిగింది. మొదటి దశలో భాగంగా స్విమ్స్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలో ఈ ప్రక్రియను అమలు పరిచి ప్రారం భించి, మిగిలిన విభాగాలలో కూడా త్వరలోనే ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ శ్రీ బాలాజీ ఇన్స్టిట్యూట్ ఆపన ఆంకాలజీ స్పెషల్ ఆఫీసర్ డా. ఎం. జయచంద్రారెడ్డి, ఆర్‌ఎంఒ డా. కోటిరెడ్డి, గ్యాస్ట్రోఎంట్రాలజీ విభాగాధిపతి డా. వెంకటరామిరెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ ఎం. సురేష్, డిప్యూటీ డైరెక్టర్ నర్సింగ్ ప్రభావతి, ఎడి సతీష్, టిటిడి, బిఎం ఐటి, సందిప్ రెడ్డి ఐటి ప్రణయ తేజ, కంప్యూటర్ అసిస్టెంట్ ప్రసాద్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## చంద్రబాబు కోసం తమిళనాడు పళని ఆలయంలో పూజలు



కుప్పంరూరల్, అక్టోబర్ 12 ప్రభాతవార్త : తెదేపా అధినేత చంద్రబాబునాయుడు ఆరోగ్య ంగా ఉండాలని, ఆయన త్వరగా జైలునుంచి బయటకురావాలని కోరుతూ తమిళనాడులో పళనిలోని ప్రసిద్ధ శ్రీ మురుగన్ ఆలయంలో మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్ అధ్వర్యంలో తెలుగు యువత నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చంద్రబాబు త్వరగా జైలునుంచి విడుదల కావాలని కోరుకున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుయువత నేత చెక్కునత్తం మణి, నేతలు సంతోష్, సుబ్బు, బాలు, మంజు, జెఎంసి మురళి, చంద్ర పాల్గొన్నారు.

## దేవి నవరాత్రి ఉత్సవాల గోడపత్రికలు ఆవిష్కరణ



శ్రీకాళహస్తి,అక్టోబర్ 12 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలోనూ, అనుబంధ ఆలయాలైన కనకాచలంపై వెలసిన దుర్గమ్మ, ముత్యాలమ్మగుడి, ఏడు గంగమ్మల గుడి వద్ద దసరా ఉత్సవాలకు సంబందించిన గోడ పత్రికలను గురువారం ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు అవిష్కరించారు. ఆలయంలోని గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద ఆవిష్కరణ కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. ఆలయ ఇఒ కెవి సాగర్‌బాబు సారధ్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు ముఖ్యఅతిధిగా ఛైర్మెన్ హాజరయ్యారు. గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం ఆలయం తరఫున నెల నెలా ఒక ఉత్సవం నిర్వహించటం ఆనవాయితి అన్నారు. ద్రౌపదీ సమేత ధర్మరాజుల బ్రహ్మోత్సవాలు, తరువాత ఆడికృత్తిక, ఆ తరువాత దసరా ఉత్సవాలు నిర్వహించటం ఆనవాయితిగా ఉందన్నారు. ఈ నెల 15 నుంచి 23 వరకు ఆలయానికి అనుబంధంగా వెలసిన కనకాచలంపై వెలసిన కనక దుర్గమ్మ ఆలయంలో దసరా సందర్భంగా తొమ్మిది రోజుల పాటు వివిధ అలంకారాలతో అమ్మవారిని కొలవటం ఆనవాయితి అన్నారు. ఈ కార్యక్రమాల్లో ఛైర్మెన్‌తో పాటు ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్, ఎఇఒలు ధనపాల్, సతీష్‌మాలిక్, లోలకేష్‌రెడ్డి, సూపరింటెండెంట్‌లు నాగభూషణం యాదవ్, శ్రీహరి, టెంపుల్ ఇన్స్పెక్టర్ సుదర్శనం నాయుడు, సభ్యులు రమాప్రభ, చింతామణి పాండు, జూలుగంటి సుబ్బారావు, పట్టణ ప్రముఖులు కొండూరు నంద, గిరిప్రసాద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## 13 నుండి జగనన్న పాల వెల్లువ రెండవ విడత సర్వే : కలెక్టర్

చిత్తూరు, అక్టోబర్ 12 ప్రభాతవార్త: జగనన్న పాల వెల్లువ రెండవ విడత సర్వేను నవంబర్ 13వ తేదీ నుండి 11 మండలాల్లోని 107 ఆర్‌బికెల పరిధిలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ సగిలి షన్మోహన్ గురువారం జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులుతో కలిసి జగనన్న పాల వెల్లువ రెండవ విడత పాల సేకరణ ప్రారంభంపై అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జగనన్న పాల వెల్లువ మొదటి విడతలో పైలట్ ప్రాజెక్టు కింద వి.కోట, శాంతిపురం, రామకుప్పం మండలాల్లోని 101 గ్రామాల్లో ప్రారంభం కావడం జరిగిందని, అలాగే 2వ విడత పాల సేకరణకు తవణంపల్లి, ఐరాల, బంగారుపాళ్యం, బైరెడ్డిపల్లి, పలమనేరు, పూతలపట్టు, కార్వేటినగరం, నగరి, నింద్ర మండలాల్లో ఈ నెల 13వ తేదీ నుండి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్వే అనంతరం నవంబర్ 4వ వారం నుండి పాల సేకరణ ప్రారంభించడం జరుగుతుందన్నారు. జిల్లాలో పాల ఉత్పత్తి పుష్కలంగా వున్న గ్రామాల్లో మెంబర్లు, రూట్ ఇన్‌ఛార్జీలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ల ద్వారా ఎఎంసియులను గుర్తించి భవనాలను సిద్ధంగా వుంచుకోవాలని ఎంపిడిఓలకు సూచించారు. అలాగే ఎఎంసియుల్లో అవసరమైన సాఫ్ట్‌వేర్‌లను సిద్ధం చేసుకొని పాడి రైతుల వివరాలను నమోదు చేయాలన్నారు.